క్లుప్తంగా

శ్రీవారి సేవలో బుల్లితెర నటుడు సెల్వరాజ్



పూజలు నిర్వహిస్తున్న సెల్వరాజ్

ద్వారకాతిరుమల : చినవెంకన్న దివ్యక్షేత్రాన్ని ప్రముఖ బుల్లి తెర నటుడు సెల్వరాజ్ బుధవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాన్ని, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా సెల్వరాజ్ మాట్లాడుతూ తాను నటించిన చక్రవాకం సీరియల్ తనకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టిందన్నారు. అలాగే థ్రిల్, మా ఇంటి ఆడపడుచు, కంటే కూతురినే కనాలి, బంగారు పంజరం, అన్నాచెల్లెళ్లు వంటి పలు సీరియల్స్‌లో తాను మంచి పాత్రలను పోషించినట్లు చెప్పారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన శ్రీవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు



టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డితో అనసూయ దంపతులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలు ఆచంట అనసూయ, సురేష్ దంపతులు టీటీడీ చైర్మన్ భూమాన కరుణాకర్‌రెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు చినవెంకన్న చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

కక్షిదారులను చైతన్య పరచాలి

చింతలపూడి : జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా కక్షిదారులను చైతన్య పరచాలని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు అన్నారు. బుధవారం చింతలపూడిలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువగా సివిల్ కేసులు రాజీ చేసుకునేలా న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సివిల్ కేసులలో రాజీ పడితే కోర్టుకు కట్టిన ఫీజు తిరిగి వస్తుందని, సమయం ఆదా అవుతుందన్నారు. కావున న్యాయవాదులు ఈ దిశగా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాకర్ల మాణిక్యాలరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి నివాళి

జంగారెడ్డిగూడెం : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని బుధవారం జంగారెడ్డిగూడెంలో బీజేపీ నాయకులు నిర్వహించారు. ఏలూరు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు పీవీ రామలక్ష్మి నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి ప్రధానిగా దేశంలో చేసిన పథకాలు, అభివృద్ధి గురించి నాయకులు మాట్లాడారు.

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి



గవరవరంలో గౌతు లచ్చన్న జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 144వ జయంతి కార్యక్రమం గవరవరం గ్రామంలో బుధవారం నిర్వహించారు. రాష్ట్ర బీసీ చైతన్య సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు జువ్వాది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లచ్చన్నను ఆదర్శంగా తీసుకుని బీసీల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షులు వెలగల దుర్గారావు, కాసగాని గోఖలే, ప్రధాన కార్యదర్శి గాడిచర్ల సోమేశ్వరరావు, కారంకి సత్యనారాయణ, పట్టపగలు శ్రీనివాసరావు, గోపాలరాజు, ఎ.గంగాధర్, కోటిపల్లి నాని పాల్గొన్నారు.

జామాయిల్ ప్లాంటేషన్ పరిశీలన

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం సమీపంలోని వెలుతురువారిగూడెం వీఎస్ఎస్ పరిధిలో గల జామాయిల్ ప్లాంటేషన్‌ను డీఎఫ్ఓ రవీంద్ర దామా బుధవారం పరిశీలించారు. 2009లో నాటిన జామాయిల్ మొక్కలు ప్రస్తుతం కట్టింగ్ స్టేజ్‌కు వచ్చాయని ఈ మొక్కల కట్టింగ్‌కు సంబంధించి డీఎఫ్ఓ పరిశీలన చేసినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. మొత్తం 25 హెక్టార్లలో కట్టింగ్ చేసేందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే అసత్య ఆరోపణలు

ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా




చింతలపూడిలో సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా, జంగారెడ్డిగూడెంలో కన్వీనర్ల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.3.50 లక్షల కోట్లు పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాల రూపంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పేర్కొన్నారు. స్థానిక షాదీఖానాలో చింతలపూడి, లింగపాలెం మండలాల సచివాలయ కన్వీనర్‌ల సమావేశాన్ని మండల సచివాలయ కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష పార్టీలకు కళ్లు కుట్టాయని, ప్రభుత్వంపై నిత్యం బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ తన దత్తతండ్రికి మేలు చేయడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిరోజు విషం కక్కుతున్నారని, రాష్ట్రంలోని పచ్చపత్రికలు, పచ్చ మీడియా వీరి దుష్ప్రచారాలను పతాక శీర్షికలో వేసి ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో వీరి దుష్ప్రచారం మరీ ఎక్కువైందన్నారు. ప్రజలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను నమ్మే పరిస్థితుల్లో లేరని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే సచివాలయాలను రద్దు చేస్తామని, వలంటీర్ వ్యవస్థలను తీసివేస్తామని పవన్‌కళ్యాణ్ ప్రగల్భాలు పలుకుతున్నారని, ఆయన అధికారంలోకి వచ్చేదిలేదు, సచివాలయ వ్యవస్థను కదిపేది లేదన్నారు. పవన్‌కళ్యాణ్ ముఖ్యమంత్రి అవుతానని పగటి కలలు కంటున్నారని, మరో 30 ఏళ్ల వరకు జగన్‌మోహన్‌రెడ్డే ఈ రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా పరిపాలన సాగుతుందన్నారు. చంద్రబాబుకు ఈ మధ్య మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ఆయన ప్రసంగాలు వినడానికి ప్రజలు కూడా రావడం లేదని ఎద్దేవా చేశారు. అనంతరం సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులకు వైఎస్సార్ సీపీ చెప్పిన విధంగా ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా జేసీఎస్ సైన్యం అనే యాప్‌ను సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు తమ మొబైల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, పూర్తి వివరాలను ఇవ్వాలని సూచించారు. సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులకు ఏదైనా అపశృతి చోటు చేసుకుంటే వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి ఈ ఇన్సూరెన్స్ పథకం ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో లింగపాలెం మండల సచివాలయాల కన్వీనర్ శాంతారావు, చింతలపూడి పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎస్.దుర్గారావు, మండల పరిషత్ చీఫ్ విప్ కె.రామారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కాంతారావు, సర్పంచ్‌లు తాండ్ర రామకృష్ణారావు, యడ్లమోహన్‌రావు, వెంకట్రావు, కె.శివరామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు అద్భుతం

జంగారెడ్డిగూడెం : సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు ప్రపంచంలోనే అద్భుతమైన వ్యవస్థలు అని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో జంగారెడ్డిగూడెం పట్టణ, మండల, కామవరపుకోట మండలంలోని సచివాలయ కన్వీనర్‌లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఎవరికి రాని ఆలోచన సీఎం వైఎస్ జగన్‌కు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి సేవలు అందిస్తోందని, ప్రజల చుట్టూ ప్రభుత్వం తిరుగుతుందన్నారు. రూ.3.50లక్షల కోట్లు ప్రజా సంక్షేమానికే జగనన్న ప్రభుత్వం ఖర్చు చేసినట్లు వెల్లడించారు. 30 లక్షల మందికి ఇళ్లస్థలాలు ఇవ్వడమేకాకుండా సొంత స్థలాలు ఉన్న 22 లక్షల మందికి ఇళ్లు మంజూరుచేసినట్లు తెలిపారు. ప్రజా అభ్యుదయం కోసం జగన్ పాటుపడుతున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఓర్వలేక తమకు అధికారం దక్కదనే అక్కసుతో జగనన్న ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. దుష్ట చతుష్టయం దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వై ఏపీ నీడ్స్ అనేది ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. పార్టీకి మీరే మూలస్తంభాలు అని అన్నారు. జగనన్నను మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. మారీచులతో యుద్ధం చేస్తున్నామని అందువల్ల మనమంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. మనమంతా జగనన్న సైనికులమని, దానిని తిప్పికొట్టాలన్నారు. వలంటీర్‌లు, సచివాలయ వ్యవస్థపై బురద జల్లుతున్నారని, దానిని తిప్పికొట్టాన్నారు. అనంతరం సచివాలయ కన్వీనర్‌లకు శిక్షణా బృందం శిక్షణా తరగతులు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి, ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్, జిల్లా పార్టీ మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, జిల్లా యూత్ కమిటీ అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, ఎంపీపీ కొదమజ్యోతి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు పీపీఎన్ చంద్రరావు, వామిశెట్టి హరిబాబు, ఏసుబాబు, ప్రసన్న, ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ పండు జగదీష్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అక్బర్, పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్ చనమాల శ్రీనివాస్, గురజాల పార్థసారథి, మిడతారమేష్, సాగర్, బత్తిన చిన్న, వందనపు వెంకటేశ్వరరావు, గంజి వినోద్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ చట్టాన్ని అమలు చేయాలి



ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్లు

జంగారెడ్డిగూడెం : బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో ప్రపంచ వృద్ధుల కోర్కెల దినోత్సవం నిర్వహించారు. స్థానిక కిడ్స్ స్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుకునూరు రామచంద్రరావు మాట్లాడుతూ తల్లితండ్రులు, వృద్ధుల సంరక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాలను కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. వృద్ధుల సంరక్షణకు బడ్జెట్ కేటాయించాలని, సమస్యలను తీర్చేందుకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని, 1999 జాతీయ వృద్ధుల విధానాన్ని అమలు చేయాలని, రైల్వేలో టికెట్‌ల రాయితీ పునరుద్ధరించాలని, వృద్ధుల చట్టం 2007 పటిష్టంగా అమలు చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో కె.కోటేశ్వరరావు, డి.కేదారేశ్వరరెడ్డి, జాయింట్ సెక్రటరీ బి.సత్యనారాయణ, కోశాధికారి ఎస్.సుబ్బరాయవర్మ, గౌరవ సలహాదారు కె.బాలకృష్ణ, దాదా (ఏఎస్పై) యాకూబ్, జె.మల్లికార్జునరావు, దత్తాత్రేయుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడపగడపకు'

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం సచివాలయ పరిధిలో గురువారం ఉదయం 8 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- పోలవరంలో ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బ్రోచర్‌లను అందిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్ : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం గ్రామంలోని సచివాలయం -1 పరిధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఎన్నో అవస్థలు పడేవారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, వలంటీర్లు ఇంటింటికి వచ్చి పెన్షన్‌లు అందించడంతో పాటు సంక్షేమ పథకాల వివరాలు తెలియజేసి అర్హత ఉన్న వారికి అందించడం జరుగుతుందన్నారు. పలువురు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పక్కా డ్రెయిన్‌లు నిర్మించాలని, వర్షంనీరు, మురుగునీరు నిలిచిపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. అలాగే మంచినీరు సరఫరా కావడం లేదని చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే అక్కడే ఉన్న అధికారులను పిలిచి తక్షణమే పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఆ ప్రాంతవాసులకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా కృషిచేయాలన్నారు. అనంతరం పోలవరం గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఐటీడీఏ పీవో సూర్యతేజతో కలిసి ఎమ్మెల్యే బాలరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హమకుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, సర్పంచ్ పొడుం పుష్ప, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, ఎంపీటీసీలు కాశీ ధనలక్ష్మి, మిడియం సింగరాజు, యామల శ్రీదేవి, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా

పోలవరం రూరల్ : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు బుధవారం సందర్శించి వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. వసతులపై వైద్యాధికారులు రేణుక, జ్యోతిలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో అన్ని రకాల మందులు ఉన్నాయా, ఓపీ ఎంత వరకు వస్తోంది. రోగులకు సంతృప్తికరంగా వైద్యసేవలు అందిస్తున్నారా లేదా అనే విషయాలను ఆయన తెలుసుకున్నారు. వైద్యశాలలో ఇంకా ఏమైనా పరికరాలుగాని, వసతులు గాని అవసరం ఉన్నాయా అని తెలుసుకుని అవసరమైతే నివేదిక ఇవ్వాలన్నారు. వైద్యశాలలో వైద్యాధికారులు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని, ఎవరూ ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యే వెంట ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు ఉన్నారు.

250 మందికి వైద్యసేవలు

పోలవరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో టీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రమ ఆసుపత్రి వైద్య నిపుణులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. వైద్యశిబిరంలో 250 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, వైద్యాధికారులు సాయిదివ్య, శివకుమార్, దీప్తి, భార్గవ్, అశోక్ కుమార్, సాయి ఆదిత్య, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రదర్శనకు పురస్కారం



చిరుధాన్యాల ప్రదర్శనకు పురస్కారాన్ని అందుకుంటున్న కృపామణి బృందం

కొయ్యలగూడెం : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రమైన ఏలూరు పోలీసు పేరెడ్స్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా ఆహార ఉత్పత్తుల ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శన కోసం కొయ్యలగూడెం మండలం కనకాద్రిపురం గ్రామంలో మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు అవకాశం దక్కింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా ఉద్యానవన పంటల శాఖ కనకాద్రిపురం ఉత్పత్తులకు కోసం ప్రత్యేకంగా స్టాల్ కేటాయించటంతో ×గుడ్ హెల్త్ మిల్లెట్స్ ఫుడ్×× పేరుతో ఉన్న తమ ఉత్పత్తులను ప్రదర్శించినట్లు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తోట కృపామణి బుధవారం సాయంత్రం ఇక్కడ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పినిపె విశ్వరూప్‌తో కలిసి స్టాల్స్ సందర్శించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తపరిచి జిల్లా వ్యాప్తంగా జరిగే ఈ ఉత్పత్తుల విక్రయానికి జిల్లా స్థాయిలో బహిరంగ మార్కెట్ సదుపాయం కోసం ఎగ్జిబిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారని చెప్పారు. అంతేగాక వివిధ శాఖల శకటాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ శకటంలో కొయ్యలగూడెం మండలానికి ప్రాధాన్యత దక్కిందన్నారు. ఆ శకటంపై ×గుడ్ హెల్త్ మిల్లెట్స్ ఫుడ్×× ప్రదర్శించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయ రాజు, జీవనోపాధుల మిషన్ డీపీఎం విజయకుమారి, ×గుడ్ హెల్త్ మిల్లెట్స్ ఫుడ్× సభ్యులు చిన్నం గవరమ్మ, సకినాల శిరీష పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌ల కిట్ల అందజేత



ఆధార్ కిట్లను అందజేస్తున్న ఐటీడీఏ పీవో సూర్యతేజ

పోలవరం రూరల్ : ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ఆధార్ సేవలకు ఇబ్బంది లేకుండా ప్రతి మండలంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని కేఆర్‌పురం ఐటీడీఏ అధికారి సూర్యతేజ తెలిపారు. బుధవారం కేఆర్‌పురం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఐదు ఆధార్ సెంటర్‌లకు సంబంధించి ఆధార్ కిట్‌లను అందించారు. ప్రాజెక్టు అధికారి సూర్యతేజ మాట్లాడుతూ కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో ఉన్న పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుకునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలో ఉన్న వారికి ఈ కిట్లు అందజేయడం జరిగిందన్నారు. ఈ ఆధార్ సెంటర్‌లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పీవోను కలిసిన నిర్వాసితులు

కుకునూరు : గత ఏడాది గోదావరి వరదలకు నష్టపోయిన నిర్వాసితుల ఖాతాల్లో పరిహారాన్ని జమ చేయాలని కోరుతూ, ఆర్‌అండ్‌ఆర్ పరిహారానికి సంబంధించి కుకునూరుకు చెందిన పలువురు బాధితులు తమ సమస్యను బుధవారం కేఆర్‌పురంలో ఐటీడీఏ పీవో సూర్యతేజను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ గోదావరి వరద నష్టానికి సంబంధించి పూర్తిగా ఇళ్లు నేలమట్టమైన కొందరికి రూ.3 వేలు పరిహారం అందించారని, అటువంటి వారికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా పరిహారాన్ని అందించాలని కోరామన్నారు. మరికొందరు ఇళ్లు నష్టపోయినప్పటికీ పరిహారం జాబితాలో తమ పేర్లు లేవని, పరిహారం జాబితాలో ఉన్న పేర్లకు కూడా నష్టపరిహారం జమ కాలేదని పీవోకు చెప్పామన్నారు. అంతేగాక ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి స్థానికంగా ఉంటున్న వారి పేర్లు జాబితా నుంచి తొలగించడంతో, మరలా దరఖాస్తు చేసుకున్నామని, అందుకు సంబంధించి విచారణ పూర్తి చేశారని, తమకు న్యాయం చేయాలని కోరినట్లు బాధితులు చెప్పారు.

చిత్రలేఖనం పోటీలు



బహుమతులు అందుకున్న విజేతలు

లింగపాలెం : స్వాతంత్ర్య దినోత్సవంను పురస్కరించుకొని ధర్మాజీగూడెం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయురాలు పద్మజ సీనియర్స్, జూనియర్స్ రెండు విభాగాలలో నిర్వహించిన ఈ పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు హెచ్‌ఎం టీవీఎస్ఎస్ రాజు బహుమతులు అందజేశారు.

మహిళ అరెస్ట్

చింతలపూడి : చింతలపూడి మండలం సీతానగరం గ్రామంలో సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె ప్రసాద్ బుధవారం తెలిపారు. మహిళది నాగిరెడ్డిగూడెం గ్రామమని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానవత ఆర్థిక సాయం

కొయ్యలగూడెం : ఓ విద్యార్థినికి కొయ్యలగూడెం మానవత శాఖ ఆర్థిక సహాయం అందజేసింది. జగన్నాథపురం గ్రామానికి చెందిన మిరియాల మాధవి ఇంటర్మీడియెట్‌లో 913 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. అలాగే నీట్‌లో 400కుగాను 300 మార్కులు సాధించింది. నర్సింగ్‌లో జాయిన్ అవటం నిమిత్తం మానవత సంస్థ సభ్యులు ఆమెకు రూ. 5 వేలు సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ బొమ్మ రామ్మోహనరావు, ముప్పనపల్లి వెంకటేశ్వరరావు, వీఎస్ఎన్ స్వామి, నక్కా బాబీ, మందపాటి రామకృష్ణ, బవిరిశెట్టి నాగేశ్వరరావు, బూసి త్రిమూర్తులు, మురమళ్ళ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జలకళ.. పేద రైతులకు వరం



వ్యవసాయ మోటార్లను అందచేస్తున్న ఎలీజా

చింతలపూడి : రాష్ట్రంలో లక్షలాది మంది పేద రైతులకు వైఎస్సార్ జలకళ పథకం ద్వారా వ్యవసాయ బోర్లు తవ్వించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగునీటి కష్టాలు తీరుస్తున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. చింతలపూడిలో బుధవారం వైఎస్సార్ జలకళ పథకంలో మంజూరైన సబ్‌మెర్సిబుల్ మోటార్లను రైతులకు ఎమ్మెల్యే ఎలీజా అందచేశారు. మండలంలో 8 మంది రైతులకు రూ.9.60 లక్షల విలువైన మోటార్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని అన్నారు. ప్రతి ఏటా వ్యవసాయ ఖర్చుల కోసం రైతు భరోసా పథకంలో భాగంగా రూ.13 వేలు అందచేస్తున్నట్లు తెలిపారు. రైతులు జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మండలపు సాయిబాబు, క్రిస్టియన్ మైనారిటీ బోర్డు డైరెక్టర్ పండు జగదీష్, నాయకులు ఎస్ దుర్గారావు, ఎం దిలీప్, ఎం ఇమ్మానియేలు, జె శ్రీహరిరెడ్డి, జంగా చెన్నకేశవరెడ్డి, తాండ్ర రామకృష్ణరావు, యడ్ల మోహన్‌రావు, చుండూరి నాగేశ్వరరావు, రామిశెట్టి వెంకటేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం : విద్యుత్ లైన్స్ మీద గల చెట్ల కొమ్మలు తొలగించు పని నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. పట్టణంలోని బాలాజీ నగర్, ఎన్‌టీఆర్ నగర్, రాజుల కాలనీ, పిరమిడ్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వామికి అభినందనలు



జెడ్పీ చైర్మన్ పద్మశ్రీ నుంచి అవార్డు అందుకుంటున్న స్వామి

కొయ్యలగూడెం : బెస్ట్ ఎంప్లాయ్ అవార్డును అందుకున్నట్లు మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కాకరపర్తి స్వామి బుధవారం పేర్కొన్నారు. 77 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏలూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ చేతుల మీదుగా సీనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్నానన్నారు. జెడీ సీఈవో సమక్షంలో ఈ అవార్డు అందజేశారన్నారు. పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గున్నూరి శ్రీధర్ రాజు తదితరులు స్వామిని అభినందించారు.

పేదల మెరుగైన జీవనానికి భూపోరాటాలు

జంగారెడ్డిగూడెం రూరల్ : పేదల మెరుగైన జీవనానికి ఎన్నో భూ పోరాటాల ద్వారా లక్షలాది ఎకరాల భూమిని సాధించి పేదలకు పంచి పెట్టిన ఘనత సీపీఐకి, వ్యవసాయ కార్మిక సంఘానికి ఉందని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. బుధవారం పంగిడిగూడెం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల మహా సభ నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.